క్లుప్తంగా

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: డీజిల్ పొదుపు, ఆదాయం పెంపుతోనే ఆర్టీసీ ప్రగతి సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ప్రతి నెలా మాదిరిగానే బుధవారం ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ మే నెలలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన, డీజిల్‌ను పొదుపు చేసిన డ్రైవర్లు, కండక్టర్లను సత్కరించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనశాలకు శంకుస్థాపన

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూల్లో విద్యార్థుల భోజనశాలకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం శంకుస్థాపన చేశారు. వాష్ సంస్థ రూ.15 లక్షలతో దీన్ని నిర్మిస్తోంది. ఇందుకోసం పది శాతం మార్జిన్‌ను దుళ్ల గ్రామానికి చెందిన చిట్టూరి వెంకట చౌదరి రూ.1.50 లక్షలు సమకూర్చారు. అనంతరం దుళ్ల గ్రామంలోని ఎర్ర కాలనీలో తాగునీటి పైప్‌లైన్, కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కడియం: ప్రణాళికాబద్ధ బోధన కోసం ఉపాధ్యాయులకు డైరీ ఎంత అవసరమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. యూటీఎఫ్ కడియం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ డైరీ, సీఎల్ అప్లికేషన్ల పుస్తకాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంఈఓలు సుకుమార్, వై.నాగేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆనం కళాకేంద్రంలో ఎల్‌సీడీసీ శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ఆనం కళాకేంద్రంలో బుధవారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) జరిగింది. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, టీబీ ఆఫీసర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ జూలై 18 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకూ ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి శిక్షణ ఉంటుందన్నారు. లెప్రసీ లక్షణాలు, గుర్తించే విధానం, బాధితులకు అందించాల్సిన వైద్యంపై జాగ్రత్తలను వివరించామన్నారు. కొవ్వూరు డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.సంధ్య, డీఎస్ఎంవో పి.శ్రీనివాస్, పీఎంఓ వీరలక్ష్మి, డీపీఎంవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రకాశం నగర్: సుంకర భాస్కరరావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్టూడెంట్స్ కిట్‌లోని టెక్స్ట్, నోట్ పుస్తకాలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పంపిణీ చేశారు. తొలుత ఆంధ్ర రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడా పితామహుడిగా ఖ్యాతి గాంచిన సుంకర భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రీడా సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రొబ్బి సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	కల్కి
సూర్యమినీ	కల్కి
సూర్యప్యాలెస్	కల్కి
స్వామి	కల్కి
శివజ్యోతి	కల్కి
అనుశ్రీ	కల్కి
రాజా	కల్కి
ఊర్వశి	కల్కి
రంభ	కల్కి
మేనక	కల్కి
అప్సర	కల్కి
కుమారి	కల్కి
నామవరం	
వీఎస్ మహల్	కల్కి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కల్కి
కడియం	
వెంకటసూర్య	కల్కి
అశోక	కల్కి

చకచకా సాగుతూ..

- వడివడిగా తొలకరి పనులు
- బిజీగా అన్నదాతలు



దుళ్లలో సిద్ధం చేసిన నారుమడి

కడియం: మండలంలో తొలకరి పనులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన కడియంతో పాటు, వేమగిరి, జేగురుపాడు, మాధవరాయుడు పాలెం, మురమండ, దుళ్ల, కడియపుసావరం గ్రామాల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఆకుమడులు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం తొలిదశ దమ్ములు విస్తృతంగా సాగుతున్నాయి. మండలంలోని ఆరు గ్రామాల్లోనూ మొత్తం 4,900 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారని వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేశారు.

ప్రధానంగా రెండే రకాలు

తొలకరిలో మండలంలో ప్రధానంగా రెండు రకాల వరినే రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాలను రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. రబీ విత్తనాలకు ఎంటీయూ 1121ని కూడా కొందరు రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం 210 ఎకరాల్లో వరి నారుమడులను రైతులు సిద్ధం చేసుకున్నారు.

భూసారాన్ని బట్టే వాడాలి

వరిసాగు చేసే రైతులు భూసారాన్ని అనుసరించే ఎరువులు వాడాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి స్పష్టం చేశారు. అనవసరంగా ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తే రైతులకు పెట్టుబడులు పెరిగిపోవడం తప్పితే ఎటువంటి ఉపయోగం ఉండదని గుర్తించాలన్నారు. దమ్ము పూర్తయ్యాక డీఏపీ, జింక్‌ను వేసుకునే రైతులు ఈ రెండింటినీ విడివిడిగా 24 గంటల వ్యవధిలో మాత్రమే పంటకు అందించాలన్నారు. రెండూ కలిపి వినియోగిస్తే పంటకు నష్టమే ఎక్కువని గుర్తు పెట్టుకోవాలని ఏవో తెలిపారు. నాట్లు వేయడానికి 15 రోజుల ముందే దమ్ము చేయాలన్నారు.

అలాగే నాట్లు వేసేందుకు వినియోగించే వరి నారుకు ముప్పై రోజులు వయసు ఉండాలని, నాలుగు నుంచి ఆరు ఆకులు ఉండేలా చూసుకోవాలన్నారు. చదరపు మీటర్‌కు 33 మూనలు ఉండే విధంగా రబీలో నాట్లు వేసుకోవాలన్నారు. ఎక్కువ వయసు గల నారును వినియోగిస్తే దిగుబడి తగ్గుతుందని గమనించాలన్నారు. దమ్ములోనే 50 కేజీల డీఏపీ వేసుకోవాలన్నారు. మొత్తం పంట కాలానికి వంద కేజీలు మాత్రమే మూడు దఫాలుగా యూరియాను వినియోగించాలన్నారు. ఎంవోపీ 25 కేజీలు చిరుపొట్టదశలో మాత్రమే వాడాలన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు సమష్టి కృషి

- జిల్లా ఎస్పీ జగదీష్
- ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



రాజమహేంద్రవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్



కడియంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కంబాలచెరువు: మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించి, అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అన్ని విద్యాసంస్థల వద్ద ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, భవిష్యత్తును నాశనం చేసే వాటిని అరికడదామన్నారు. ఎక్కడైనా వాటి అమ్మకాలు, వినియోగం జరుగుతూ ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ర్యాలీలో అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్, డీఎస్పీలు విజయ్ పాల్, ఎం.అంబికా ప్రసాద్, త్రీటౌన్ సీఐ వీరయ్య గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పుష్కర ఘాట్ నుండి కోటిపల్లి బస్టాండ్ వరకు 500 మంది విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల నేర ప్రవృత్తి పెరిగిపోతుందన్నారు. విద్యార్థులు వాటి జోలికి పోకుండా చదువుపై శ్రద్ధ పెట్టి తల్లిదండ్రులు కలలు నెరవేర్చాలన్నారు. ఆరోగ్యం ముద్దు, మత్తు పదార్థాలు వద్దు, దురలవాట్లను మానుకుందాం, డ్రగ్స్ రహిత జీవితాన్ని గడుపుదాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు జీఎస్‌వీఏబీఎస్ మహాలక్ష్మి, రమణ, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, ఆదిత్య విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, కె.మహేశ్వరి పాల్గొన్నారు.
- ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు వై.జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఊబిలో పడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోకూడదన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ, సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.గోపాలకృష్ణ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌హెచ్‌ఓ డాక్టర్ నిక్సన్, కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, కార్యక్రమ సమన్వయకర్త జె.యాకోబ్, ఎన్‌సీసీ విభాగ సమన్వయకర్త డాక్టర్ యూసుబ్ బాషా, డాక్టర్ బి.మల్లికార్జున పాల్గొన్నారు.
- కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన కళాశాల యూత్ రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో సరదాగా చెడు స్నేహాల ఏర్పడి, క్రమంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ పుల్లారావు, డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ కేవీ.రమణ, కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వీబీటీ సుందరి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.కాస్మ, విజయలక్ష్మి, శ్రావణి, కె.చిన్నిబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

కడియం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడియం హైస్కూల్లో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి హైస్కూల్ నుంచి దేవీచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, పీడీ వీరబాబు, కడియం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కంబాలచెరువు: ఆశ వర్కర్ల ప్రతి సమస్యనూ ప్రభుత్వం వద్దకు తీసుకువెళ్లి పరిష్కరిస్తానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఆయన ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆశ వర్కర్లు తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీసూర్య ప్రభ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మీ భద్రత.. మా బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలందరికీ భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. స్థానిక సోమాలమ్మ ఆలయం సమీపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల భవిష్యత్తు కోసం మీ భద్రత.. మా బాధ్యత అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆకతాయిల ఆగడాలు, పిల్లల్ని ప్రలోభ పెడుతున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా నాయకులు అందుబాటులో ఉంటారని, సరిగ్గా స్పందించకపోతే నేరుగా తన నంబర్ 98663 17039కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వి.పుల్లారావు, పోలీసు అధికారులు, నాయకులు , మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి సహకరించండి



ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను కలిసిన సంఘ ప్రతినిధులు

కంబాలచెరువు: పొరుగు సేవలు, ఒప్పంద విధానంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా జీజీహెచ్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తుందని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి శ్యామ్‌కుమార్, సుధాకర్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన తమ సంఘాన్ని గురువారం ప్రభుత్వాసుపత్రి అధికారులకు పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభను ఆసుపత్రిలో కలిసి, సంఘ లక్ష్యాలను వివరించి, ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలని కోరారు. సంఘం ప్రభుత్వ గుర్తింపు పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. నూతన సంఘం ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, మేనేజర్ కేదార్, పరిపాలనాధికారి శ్యామ్ సుందర్‌ను కలిశారు. కార్యక్రమంలో దారా చంద్రశేఖర్, కుశ రాజు, అవినాష్, రమణ పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

కంబాలచెరువు: జిల్లాలో ఒక్క డయేరియా మరణం కూడా సంభవించకూడదని, ఆ దిశగా పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, మందులు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024పై బుధవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో పీహెచ్‌సీ, యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా నిర్మూలనపై జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, ఆ వ్యాధి ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలలో డయేరియా మరణాలు లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్ వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేసి పిల్లల్లో వచ్చే డయేరియాకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్, పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి బుధవారం తమ గ్రామాలలో నీటి నమూనాలను పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడిమియాలాజిస్ట్ డాక్టర్ సుధీర్ బాబు, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షమ్మి కుమార్, పీహెచ్‌సీ, యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు హాజరయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల అభ్యున్నతి



అంగన్‌వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అధికారులు

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పెదపూడి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ శ్రీ గౌరీ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని మెయిన్ రోడ్డు ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పెద్దాడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 40 మంది చిన్నారులను సమీప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. అలాగే పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు, పట్టా ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీవీవీ సత్యనారాయణ, సంపర సెక్టార్ సూపర్ వైజర్ పద్మావతి, ఉపాధ్యాయులు, వెంకటరెడ్డి, రామారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

పెదపూడి: బాల్య వివాహ నిర్మూలనా చట్టాలపై ప్రజలకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని అంగన్‌వాడీ కేంద్రాల పెదపూడి సెక్టార్ సూపర్ వైజర్ శ్రీగౌరీ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. తల్లుల, కిశోర బాలికలు, బాలురతో సమావేశమయ్యారు. బేటీ బచావో బేటీ పడావో (బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం)పై అవగాహన కల్పించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



గోకవరంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి

గోకవరం: ఎరువులు, విత్తనాలు విక్రయించే షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లవరం, గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు.

సత్యసాయి యూనియన్ కమిటీ ఎంపిక



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయ్, మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా కట్టమూరి వీరబాబు, ఉపాధ్యక్షులుగా పాలాడి శ్రీను, ఇజ్జిన శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ఉండిర్తి ఇస్సా, వైస్ జనరల్ సెక్రటరీలుగా కట్టంగి మల్లేశ్వరరావు, జొన్నల సురేష్, ట్రెజరర్‌గా కాళ్ల రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరికీ అండగా ఉంటామన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. బకాయిలను రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు.

హెచ్ఐక్యూ ఫార్మా ల్యాబ్‌తో ఒప్పందం

కంబాలచెరువు: హెచ్ఐక్యూ ఫార్మా ల్యాబ్స్‌తో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సూక్ష్మ జీవశాస్త్ర (మైక్రో బయాలజీ) విభాగం మూడేళ్ల పాటు అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే బుధవారం తెలిపారు. హెచ్ఐక్యూ ఫార్మా ల్యాబ్స్ అనే ఫార్మా,హెల్త్ కేర్ సంస్థ హైదరాబాద్, రాజమహేంద్రవరాలలో పనిచేస్తోందన్నారు. మందుల తయారీ, శిక్షణ, మందుల నాణ్యతా పరీక్షా పద్ధతులు, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అతిథి ఉపన్యాసాలు, ప్రయోగశాలల నిర్వహణ తదితర వాటిలో సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ విభాగాధిపతి టి.సోనీ, అధ్యాపకురాలు డాక్టర్ టి.సుజాతలను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ అభినందించారు.

30న అగస్త్యేశ్వరాలయ వార్షికోత్సవం

కడియం: దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరాలయ 12వ వార్షికోత్సవాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్టు భక్త బృందం తెలిపింది. బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి, కంఠం వినాయక శర్మ, పూజ్యం కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

మృతుడి ఆచూకీ లభ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్య మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. జీఆర్పీ ఎస్సై లోవరాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి రాజమహేంద్రవరం–కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య చనిపోయి ఉన్నాడు. రైల్వే పోలీసులు ఆ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రిలోని మార్చురీ రూమ్‌కు తరలించారు. కాగా.. ఆ ఘటనకు సంబంధించిన వార్త బుధవారం 'సాక్షి' పత్రికలో వచ్చింది. దానిని మృతుడి బంధువులు చదివి.. స్టేషన్‌కు వచ్చారు. మృతుడు రాజమహేంద్రవరానికి చెందిన సరగడ భరణి వెంకట రాధాకృష్ణ (35)గా గుర్తించారు.

క్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి నెలకొంటుందని రోమన్ కథోలిక సంఘం ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి మెయిన్‌రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులు నిజమైన ప్రవక్తలను ఎంపిక చేసుకోవాలని, తద్వారానే మంచి బోధనలు వెల్లడవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి ఉపదేశి రాయి థోమాస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కిట్ల పంపిణీ జరిగింది. మండల విద్యాశాఖాధికారులు కుశలవదొర, సుజాత ఆధ్వర్యంలో వీటిని అందించారు. మండల కేంద్రానికి చేరిన కిట్లను మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి గరిక పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ సమీపంలో కొలువుతీరిన సిద్ధి వినాయకునికి బుధవారం గరిక పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వినాయకుని ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని వరసిద్ధి వినాయకస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. రాత్రి భజన జరిగింది.